| **Date:** 29.3.2021 | **Publication:** Sakshi |
|---|---|
| **Page no.:** 12 \| 10 | **Edition:** Hyderabad \| Bengaluru |
| **Headline:** Motor Insurance for road trips | |



# కాసింత బీమా.. కొండంత ధీమా..

## రోడ్ ట్రిప్‌లకు వాహన బీమా భరోసా..



ఆదిత్య శర్మ
హెడ్ (మోటార్ బిజినెస్),
బజాజ్ అలయంజ్
జనరల్ ఇన్సూరెన్స్

కరోనా వైరస్ మహమ్మారిపరమైన కారణాలతో చాలాకాలంగా చాలా మంది ప్రయాణాలు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ప్రస్తుతం టీకా అందుబాటులోకి రావడంతో కుటుంబసభ్యులు, స్నేహితులతో సొంత వాహనాల్లో మళ్లీ సరదాగా విహార యాత్రలు ప్లాన్ చేసుకోవడం మొదలుపెడుతున్నారు. వైరస్ నుంచి రక్షణ పొందేందుకు శానిటైజర్లు, మాస్కులు మొదలైన జాగ్రత్తలతోనే బైల్దేరే పనిలో ఉన్నారు. అదే సమయంలో వాహన ప్రమాదాల్లాంటి అనూహ్య ఘటనల నుంచి కూడా ఆర్థికంగా రక్షణ పొందేందుకు తగిన వాహన బీమా పాలసీ తీసుకోవడం కూడా శ్రేయస్కరం. దీనితో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. రోడ్ ట్రిప్‌పై కొత్త ప్రదేశాలకు బయల్దేరినప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశాలనూ తోసిపుచ్చలేము. ఒకవేళ మీ వాహనం వల్ల థర్డ్ పార్టీకి శారీరకంగా గానీ లేదా ప్రాపర్టీపరంగా గానీ హాని ఏదైనా జరిగితే పరిహారం చెల్లించాల్సి వచ్చిన పక్షంలో మీ పర్సుపై భారం పడకుండా థర్డ్ పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ ఆదుకుంటుంది. లేకపోతే వాహన బీమా లేనందుకు జరిమానాతో పాటు థర్డ్ పార్టీకి లక్షలు, కోట్ల కొద్దీ రూపాయలు పరిహారం కింద చెల్లించుకోవాల్సి వచ్చే ముప్పు ఉంది.

**ప్రకృతి వైపరీత్యాల్లోనూ తోడు..**

సమగ్రమైన మోటార్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకుంటే వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫానులు వంటి అనూహ్య ప్రకృతి వైపరీత్యాలు వచ్చి .. మీ వాహనం దెబ్బతిన్న పక్షంలో టోయింగ్ నుంచి రిపేరు దాకా అన్నింటికీ కవరేజీ పొందవచ్చు. అలాగే, కారు లేదా బైకు చోరీ అయినా .. గొడవల్లోను, ఆఖరికి ఉగ్రవాద దాడుల్లో మీ వాహనం ధ్వంసమైనా బీమా పాలసీ కవరేజీ అందిస్తుంది. వీటితో పాటు రోడ్ సైడ్ అసిస్టెన్స్, వ్యక్తిగత ప్రమాద బీమా కవరేజీ వంటివి కూడా లభిస్తాయి. ప్రమాదాల్లో కారు యజమాని/డ్రైవర్‌కు గాయాలైనా, మరణించినా లేదా శాశ్వత వైకల్యానికి గురైనా పాలసీ పరిమితిని బట్టి పరిహారం పొందవచ్చు.

**విదేశాల్లోనూ..**

భారత సరిహద్దులు దాటి బంగ్లాదేశ్, నేపాల్, భూటాన్, పాకిస్తాన్, మాల్దీవులు, శ్రీలంక వంటి ఆరు భౌగోళిక ప్రాంతాలకు సుదీర్ఘ రోడ్ ట్రిప్‌లకు వెళ్లినా వాహన బీమా భరోసా మీ వెన్నంటే ఉండేలా కూడా కొన్ని పాలసీలు ఉన్నాయి. కాబట్టి మీ ప్రైవేట్ కారు లేదా బైక్‌తో ఈ దేశాలకు ట్రిప్ ప్లాన్ చేసుకున్నా.. కాస్త అదనపు ప్రీమియం కడితే ధీమాగా ప్రయాణాలు చేయొచ్చు. మీ రోడ్ ట్రిప్ గురించి బీమా సంస్థకు ముందుగా తెలియజేస్తే.. క్లెయిమ్ చేయాల్సిన పరిస్థితి వచ్చిన పక్షంలో ప్రక్రియ సులభతరంగా ఉంటుంది. చికిత్స అవసరమయ్యే దాకా తెచ్చుకోకుండా ముందు నుంచే జాగ్రత్త వహించడం శ్రేయస్కరమని కోవిడ్-19 మనందరికీ ఒక్క విషయం గట్టిగా తెలియజెప్పింది. కాబట్టి సొంత వాహనాల్లో ట్రిప్‌లకు వెళ్లేటప్పుడు మోటార్ బీమా పాలసీపై కాసింత ఇన్వెస్ట్ చేస్తే నిశ్చింతగా తిరిగి రావచ్చు.